క్లుప్తంగా

డార్విన్‌కు నివాళి

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం డార్విన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా సహాయ కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ డార్విన్ జీవన పరిణామ సిద్ధాంతాన్ని కనుక్కున్న తర్వాత జీవశాస్త్రంలో పెనుమార్పులు సంభవించాయని తెలిపారు. పర్యావరణం బుద్ధి జీవులైన మానవులే పర్యావరణాన్ని కాపాడాలని, విద్యార్థి దశ నుంచి సైన్స్ పట్ల ఆశక్తి పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు మోహన్, లావణ్య పాల్గొన్నారు.

సకాలంలో బిల్లుల చెల్లింపు



బిల్లులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధి హామీ పనులతోపాటు గోకులం షెడ్ల నిర్మాణ బిల్లులను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. బుధవారం ఆయన ఏపీఓ భానుప్రియతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వేస్తున్న సీసీ రోడ్ల పనులను, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. గ్రామాల్లో గోకులం షెడ్ల పనులు, బిల్లుల చెల్లింపు అంశాలను గ్రామ పంచాయతీల వారీగా తెలుసుకుని, బిల్లుల చెల్లింపులో అలసత్వం వహించొద్దని సిబ్బందిని ఆదేశించారు.

డిజిటల్ అసిస్టెంట్ లేక అవస్థలు



ఖాళీగా దర్శనమిస్తున్న డిజిటల్ అసిస్టెంట్ కుర్చీ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ సంవత్సరకాలంగా లేకపోవడంతో గ్రామస్తులు నానా అవస్థలుపడుతున్నారు. మేజర్ పంచాయతీలో కీలకమైన డిజిటల్ అసిస్టెంట్ లేకపోవడంతో ప్రజలకు సచివాలయ సేవలు సక్రమంగా అందడం లేదు. మండలంలో బుచ్చినాయుడుకండ్రిగ, పల్లమాల, వెస్టువరత్తూరు గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలున్నాయి. బుచ్చినాయుడుకండ్రిగ గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ సంవత్సరం క్రితం బదిలీపై తొట్టంబేడు మండలానికి వెళ్లిపోయారు. అప్పటి నుంచి డిజిటల్ అసిస్టెంట్ లేక ఆధార్ సేవలు నిలిచిపోయాయి. దీంతో ఆధార్ సేవలు కోసం బుచ్చినాయుడుకండ్రిగ, నీర్పాకోట, కనమనంబేడు, పెద్దపాలేడు, చిన్నపాలేడు, కుక్కంబాకం, కాంపాళెం, గాజులపెళ్లూరు, జీఎస్‌కండ్రిగ, ఆర్ అనంతాపురం, తంగెళ్లపురం, చిన్నయగుంట, పూసలపల్లి, గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సచివాలయంలోని పలు సేవల కోసం మీసేవకు పరుగులు తీస్తున్నారు. కార్యాలయంలోని పనులు నిలిచిపోవడంతో గ్రామ కార్యదర్శి ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేసి ఆధార్, సచివాలయ సేవలను సక్రమంగా అందేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

జనసేన నేత దౌర్జన్యం

తిరుపతి తుడా: ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో కూటమి నేతల దౌర్జన్యాలు, వికృత చేష్టలు మితిమీరుతున్నాయి. 14వ వార్డులో బుధవారం జనసేన ఇన్‌చార్జి రమేష్ ఫుట్‌పాత్ వ్యాపారులపై దౌర్జన్యం చేశాడు. కమీషన్ ఇవ్వకపోతే వ్యాపారం చేసుకోలేరని బెదిరించాడు. దీన్ని గమనించిన స్థానికులు సైతం భయభ్రాంతులకు గురయ్యారు. ఇలాంటి వారిపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నాడు సంక్షేమం.. నేడు వంచన

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు ప్రతి నెలా ఏదో ఒక పథకం కింద సంక్షేమ ఫలాలు అందేవి. వీటితో సంతోషంగా జీవించిన పేదలకు ప్రస్తుత కూటమి ప్రభుత్వం షాక్‌ల మీద షాక్ లిస్తోంది. సంపద సృష్టించాకే సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామని సీఎం చంద్రబాబు చేతులెత్తేయడంతో అన్ని వర్గాల ప్రజలు మండిపడుతున్నారు.

వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నిధుల మెగా చెక్కును వరదయ్యపాళెంలో అందజేస్తున్న ఎంపీ (ఫైల్)



- అటకెక్కిన సూపర్ సిక్స్ హామీలు
- నమ్మించి మోసం చేశారని ఆవేదన
- 8 నెలలుగా ఒక్కటీ అమలుకానీ వైనం

వరదయ్యపాళెం : సూపర్‌సిక్స్ హామీల అమలుకు కూటమి సర్కారు మంగళం పాడింది. అధికారం చేపట్టి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఒక్క సంక్షేమ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏ గ్రామానికి వెళ్లినా.. ఏ ఇంట పలకరించినా.. ఏ నలుగురు కలిసినా సూపర్‌సిక్స్ హామీల అమలు పైనే చర్చ సాగుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెలకో సంక్షేమ పథకం కింద బ్యాంకు ఖాతాలకే నేరుగా డబ్బులు జమ అయ్యేదని చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంలో కొత్త హామీలు దేవుడెరుగు..ఉండే పథకాల్లోనూ కోతలు వేస్తుండడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు పింఛన్ల తొలగింపునకు జాబితా సిద్ధం చేస్తున్నారు. మరోవైపు సాధారణ పింఛన్‌దారులకు నోటీసులు ఇస్తున్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అని ప్రకటించినా చాలా మంది అర్హులకు నేటికీ గ్యాస్ సిలిండర్ డబ్బులు ఇవ్వలేని పరిస్థితి. తల్లికి వందనానికి పంగనామాలు పెట్టారు. నేతన్న నేస్తం, అన్నదాత సుఖీభవ, ఉచిత పంటల బీమా ఊసే లేదు. వసతి దీవెన, విద్యా దీవెన, జగనన్న తోడు, సున్నావడ్డీ, వాహన మిత్ర, కాపునేస్తం, జగనన్న చేదోడు లాంటి పథకాలు కనుమరుగైపోయాయి. మహిళలకు ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి ఇప్పట్లో లేనట్లేనని సర్కారు తేల్చేసింది. దీంతో పేదలు కూటమి ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

గత ప్రభుత్వంలో సత్యవేడు నియోజకవర్గానికి సమకూరిన నిధులు

మొత్తం కుటుంబాలు :	86,000
లబ్ధిదారుల ఖాతాలు :	2,40,325
సంక్షేమం ద్వారా అందిన నిధులు :	13,93 కోట్లు
నాన్ డీబీటీ నిధులు :	600 కోట్లు

సత్యవేడుకు రూ.2 వేల కోట్ల లబ్ధి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.2 వేల కోట్ల లబ్ధి చేకూరింది. నియోజకవర్గంలోని 7 మండలాల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 నుంచి 2024 మార్చి వరకు అమ్మఒడి, ఆసరా, చేయూత, రైతు భరోసా, జగనన్న తోడు, చేదోడు, రైతన్న నేస్తం, కాపు నేస్తం, విద్యా దీవెన, వసతి దీవెన లాంటి వివిధ సంక్షేమ పథకాల కోసం రూ. 1,393 కోట్లు ఖర్చు చేసింది. ఈ మొత్తం నియోజకవర్గంలోని 86 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరి 2,40,325 మంది లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయింది. అంతేకాక మరో రూ. 600 కోట్లతో పరోక్షంగా అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేసింది. మొత్తంగా ఒక్క సత్యవేడు నియోజకవర్గానికి రూ.2 వేల కోట్లు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖర్చు చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఒక్క పథకాన్ని సక్రమంగా అమలు చేయకపోగా సంపద సృష్టించాకే సూపర్‌సిక్స్ హామీలంటూ సీఎం చంద్రబాబు నాలుక మడతేయడంపై జనం గగ్గోలుపెడుతున్నారు. ఈ నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజల నుంచి ప్రభుత్వంపై ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి.

నమ్మించి మోసం



ముఖ్యమంత్రి చంద్రబాబు సంపద సృష్టించాక సూపర్‌సిక్స్ హామీలు అమలు చేస్తామనడం సరికాదు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు కూటమి ప్రభుత్వం పథకాలు అందించాలి. ఆరు గ్యారంటీల హామీలను నమ్మి ప్రజలు ఓట్లు వేశారు. లోటు బడ్జెట్ పేరుతో వంచన చేయడం సరికాదు. ఉచిత బస్సు కోసం మహిళలు ఎదురుచూస్తున్నారు.

– దీప, వరదయ్యపాళెం మండలం

కాలయాపన చేయొద్దు



సూపర్‌సిక్స్ హామీలు అమలు చేసి పేదలకు న్యాయం చేయాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించి మాజీ సీఎం వైఎస్ జగన్ న్యాయం చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. లోటు బడ్జెట్ పేరుతో కాలయాపన చేయడం సరికాదు.

– జగదీష్, మిట్టకండ్రిగ, వరదయ్యపాళెం మండలం

లోటు బడ్జెట్ పేరిట మోసం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నవరత్నాల హామీలను క్రమం తప్పకుండా అమలు చేస్తుంటే ఆర్థికంగా శ్రీలంక అయిపోతుందని హేళన చేశారు. ప్రస్తుతం సూపర్‌సిక్స్ హామీలు ఎలా అమలు చేస్తారని హామీలు ఇచ్చారు. ఇప్పుడేమో లోటు బడ్జెట్, సంపద సృష్టించాకే హామీలు అమలు సాధ్యమని చెప్పడం సిగ్గుచేటు.

– సిద్ధిక్, వరదయ్యపాళెం మండలం

ఉత్తమ ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న సభ్యులు

శ్రీకాళహస్తి: విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచి గణతంత్ర దినోత్సవంలో ఉత్తమ అవార్డును అందుకున్న తొట్టంబేడు మండల అధికారులు, ఉద్యోగులను బుధవారం యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ సభ్యులు ఘనంగా సన్మానించారు. శ్రీకాళహస్తి ఎంపీడీఓ రఫీఖాన్, తొట్టంబేడు ఎంపీడీఓ సురేంద్రనాథ్‌రెడ్డి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ హరికృష్ణ, సంస్థ అధ్యక్షుడు హేమకుమార్ పాల్గొన్నారు.


దాడిలో గాయపడిన వ్యక్తి మృతి



ధర్మలింగం మొదలి (ఫైల్)

నారాయణవనం: పేడదిబ్బ ఘర్షణలో గాయపడిన కీళగరానికి చెందిన ధర్మలింగం మొదలి చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. తన ఇంటి పక్కన ఉన్న పేడదిబ్బను తొలగించాలంటూ ధర్మలింగం మొదలి, కుటుంబసభ్యులు గత మంగళవారం అదే గ్రామానికి చెందిన పేడదిబ్బ యజమాని మణికంఠన్‌తో గొడవపడ్డారు. దీంతో మణికంఠన్, అతని కుటుంబసభ్యులు, స్నేహితులు జరిపిన దాడిలో ధర్మలింగం మొదలి, అతని పెద్దకుమారుడు లోకేష్ గాయపడ్డారు. గాయపడి చికిత్స పొందుతున్న ధర్మలింగం బుధవారం మృతిచెందాడు. ఈమేరకు ఘర్షణ కేసును హత్య కేసుగా మార్పు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇదివరకే మణికంఠన్‌తోపాటు విజయ్‌కుమార్, సుమతి, గోవింద స్వాములను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామని, త్వరలో మిగిలిన మరో ఏడుగురిని అరెస్ట్ చేస్తామని ఆయన అన్నారు.

వెన్నెల రేడు విరిసె.. ముక్కంటి మురిసె



వెన్నెల కాంతిలో శ్రీకాళహస్తీశ్వరాలయ పరిసరాలు

శ్రీకాళహస్తి: మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ఉదయం త్రిశూల స్నానం సద్యోముక్తి వ్రతం నిర్వహించారు. సాయంసంధ్య వేళ మాఘపౌర్ణమికి చంద్రుడు కన్నప్ప కొండమీద గల అమ్మవారిని సేవించవచ్చాడు అన్నట్లుగా ఉంది. రాత్రి పూర్ణచంద్రుని స్వర్ణకిరణాలకు శ్రీకాళహస్తీశ్వరాలయం బంగారు కొండలా మెరిసిపోయింది. స్వర్ణముఖి నదీ తీరంలో ఆలయ గోపురం పూర్ణచంద్రుని కాంతులతో ఆకట్టుకుంది.

వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ సిబ్బంది

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట–తిరుపతి ప్రధాన రహదారి అంబేడ్కర్ కూడలిలో బుధవారం ఉదయం రేణిగుంట అర్బన్ ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేశారు. అందులో భాగంగా ఆటోడ్రైవర్లు యూనిఫామ్, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు తప్పక ధరించాలని అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలకు వ్యతిరేకంగా వాహనాలు నడుపుతున్న వారికి, వాహనాల రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి జరిమానా విధించారు.

కోదండరాముడి పేటోత్సవానికి సర్వం సిద్ధం

తిరుపతి రూరల్: తిరుపతి కోదండరామస్వామి పేటోత్సవాన్ని గురువారం తిరుపతి రూరల్ మండలం కూపుచంద్రపేటలో నిర్వహించడానికి సర్వం సిద్ధం చేశారు. మాఘపౌర్ణమి సందర్భంగా సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి వారి ఉత్సవ మూర్తులను కూపుచంద్రపేటకు ఊరేగింపుగా తీసుకెళ్లడం ఆనవాయితీ. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉదయం 6 గంటలకు ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకుని కూపుచంద్రపేటకు వెళతారు. అక్కడ ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు స్నపన తిరుమంజనం, ఆస్థానం నిర్వహిస్తారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఊంజల్ సేవ, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 వరకు గ్రామోత్సవం చేపడతారు. తర్వాత తిరిగి తిరుపతి నగరంలోని కోదండరామస్వామి ఆలయానికి ఉత్సవ మూర్తులను తీసుకొస్తారు.

ఇసుక అక్రమ రవాణాపై దాడులు



జీపాళ్యం సమీపంలో ఇసుక డంప్

- మూడు ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం

సాక్షి ఎఫెక్ట్..

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): స్వర్ణముఖి నదిలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై సాక్షిలో వచ్చిన కథనానికి స్పందించిన గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ ఇసుక అక్రమ తవ్వకాలపై దాడులు నిర్వహించారు. జేసీబీ, మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ కథనం మేరకు.. రేణిగుంట మండలం కోట్రమంగళం సమీపంలోని స్వర్ణముఖి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయన్న సమాచారంతో సిబ్బందితో చేరుకున్నారు. తవ్వకాలు నిర్వహిస్తున్న జేసీబీ, మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అటువైపు వెళ్లకపోవడంపై ఆంతర్యం ఏమిటి..

జీపాళ్యం సమీపంలోని స్వర్ణముఖి నదిలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇసుక అక్రమ వ్యాపారం చేస్తున్నా పోలీసులు, అధికారులు అటువైపు వెళ్లకపోవడంలోని ఆంతర్యం ఏమిటని స్థానికులు అంటున్నారు. జీపాళ్యం సమీపంలో తిరుపతి–పాపానాయుడు పేట రహదారి పక్కనే ఇసుక డంప్ చేసి రాత్రి సమయాల్లో టిప్పర్లకు తోలేందుకు సిద్ధం చేస్తున్నా పోలీసులు అటువైపు వెళ్లకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి.



స్వాధీనం చేసుకున్న జేసీబీ

కార్యదర్శులు నిబద్ధతతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ



సేంద్రియ కేంద్రంలో ఎరువులు పరిశీలిస్తున్న డీపీఓ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): పంచాయతీ కార్యదర్శులు నిబద్ధతతో పనిచేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవి అన్నారు. కరకంబాడి పంచాయతీలోని స్వచ్ఛ సంకల్ప చెత్త నుంచి సంపద కేంద్రంలో బుధవారం చెత్త నుంచి సంపద నిర్వహణపై రేణిగుంట, ఏర్పేడు మండలాల విస్తరణ అధికారులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌డబ్ల్యూపీసీ జిల్లా కో–ఆర్డినేటర్ శిరీష, జిల్లా రిసోర్స్ పర్సన్స్ భరత్‌కుమార్, కిషోర్ చెత్త సేకరణ, శుద్ధి, వర్మీకంపోస్ట్, ఎరువుల తయారీపై శిక్షణ ఇచ్చారు. డీపీఓ సుశీలాదేవి పాల్గొని కరకంబాడి కేంద్రాన్ని పరిశీలించారు. ఫిబ్రవరి 15వ తేదీ నుంచి ఒక హ్యాబిటేషన్ తీసుకుని తడి, పొడి చెత్త సేకరణ చేపట్టాలన్నారు. పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే సర్పంచులు, ప్రజాప్రతినిధుల సహకారం తీసుకొని పంచాయతీలో ప్రతి కార్యదర్శి ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని 608 సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్‌లను ఫిబ్రవరి 15 నాటికి పూర్తిస్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈఓపీఆర్డీలు ప్రభురావు, రమణకుమార్, కరకంబాడి సర్పంచ్ ఈశ్వరమ్మ, కార్యదర్శి రమేష్, పంచాయతీ కార్యదర్శులు, విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ నూతన భవనం ప్రారంభం



ప్రారంభిస్తున్న సీనియర్ మేనేజర్ సిద్ధయ్య



మహిళలకు రుణాలు అందిస్తున్న పాండురంగ మితంతాయ

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా కెనరా బ్యాంక్ సిబ్బంది పనిచేస్తున్నారని ఆ బ్యాంక్ సర్కిల్ కార్యాలయం జనరల్ మేనేజర్ పాండురంగ మితంతాయ అన్నారు. రేణిగుంట పట్టణం పాత చెక్‌పోస్ట్ సమీపంలోని కరకంబాడి బ్రాంచ్ కెనరా బ్యాంక్‌ను ఎదురుగా ఉన్న నూతన భవనంలోకి బుధవారం మార్చారు. నూతన భవనాన్ని రిబ్బన్ కట్ చేసి సీనియర్ మేనేజర్ సిద్ధయ్య ప్రారంభించారు. జీఎం పాండురంగ మితంతాయ మహిళలకు రుణాలు అందజేశారు. రీజనల్ అధికారి నాగరాజరావు, డివిజన్ మేనేజర్లు శరవణకుమార్, సువర్ణకృష్ణ, హర్ష, భాస్కర్, ఏఈఓ నళిని పాల్గొన్నారు.



పురుషుల పూజలో పరిపూర్ణానందగిరిస్వామి

అజ్ఞానాన్ని తొలగించేది గురువులే!

- వ్యాసాశ్రమంలో ముగిసిన 88వ అఖండ గురుపూజోత్సవాలు

రేణిగుంట(ఏర్పేడు): ప్రజల అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానాన్ని నేర్పేది గురువులేనని ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి అన్నారు. ఏర్పేడు వ్యాసాశ్రమంలో జరుగుతున్న 88వ అఖండ గురుపూజోత్సవాలలో భాగంగా బుధవారం పురుషుల పూజతో ఉత్సవాలు ముగిశాయి. ఆశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరిస్వామి ఆధ్వర్యంలో ఆశ్రమంలోని అధిష్టాన మందిరంలో విశేష పూజలు చేశారు. కుటీరం నుంచి భక్తులు, వ్యాసాశ్రమ విద్యార్థినులు పీఠాధిపతిని మేళతాళాలు, కోలాట నృత్యాల మధ్య అధిష్టాన మందిరానికి తీసుకొచ్చారు. ఆయన అక్కడ ఆశ్రమ వ్యవస్థాపకులు సద్గురు మలయాళస్వామి శ్వేతశిలా విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు, సాధుపుంగవులు వేదమంత్రాలతో పూజలు చేసి పీఠాధిపతి నుంచి ఆశీర్వచనాలను అందుకున్నారు. భక్తులు పీఠాధిపతిని పుష్పకిరీటంతో ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ వ్యాసాశ్రమ వ్యవస్థాపకులు సద్గురు మలయాళస్వామి చూపిన ఆశయాలకు అనుగుణంగా ఆశ్రమాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. శివరాంస్వామి, విమలానందస్వామి పాల్గొన్నారు.



కోలాట నృత్యాలు